క్లుప్తంగా

సత్సంగాలతో హిందూ ధర్మ పరిరక్షణ


సత్సంగంలో పాల్గొన్న ఆధ్యాత్మికవేత్తలు

సారవకోట: గ్రామాల్లో ఆధ్యాత్మిక సత్సంగాలు ఏర్పాటు చేయాలని ఆధ్యాత్మిక వక్త తిరుపతి రావు అన్నారు. ఆదివారం మండలంలోని బుడితి గ్రామంలో ఆధ్యాత్మిక విజ్ఞాన పీఠం, దివ్యజీవన సమాజం ఆధ్వర్యంలో సత్సంగం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన తిరుపతిరావు మాట్లాడుతూ హిందూ ధర్మ పరిరక్షణకు గ్రామాల్లో ఆధ్యాత్మిక సత్సంగాలు ఎక్కువగా నిర్వహించాలన్నారు. ఎన్నో ఆచార, సంప్రదాయాలకు, సంస్కృతులకు నిలయమైన మన దేశ ప్రతిష్టను మరింత పెంచాలన్నారు. బగాది రామారావు, కరుణాకర్, అల్లు రామయ్య, పి.రాంబాబు ఆధ్యాత్మిక ప్రవచనాలు చేశారు. ఈ కార్యక్రమంలో మెండ సన్యాసిరావు, సోమేశ్వరరావు, సిద్ధయ్య స్వామి పాల్గొన్నారు.

శ్రీముఖలింగేశ్వరుని సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తి


ఆలయ కథను వివరిస్తున్న అర్చకుడు

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగంలో వెలిసిన మధుకేశ్వరుడిని హైకోర్టు న్యాయమూర్తి ఎస్.సుబ్బారెడ్డి దంపతులు ఆదివారం దర్శించుకున్నారు. వారాహి అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. ఆలయ చరిత్ర, గర్భగుడిలో ఉన్న గోలెం వృత్తాంతం, శిల్పకళా సంపదను ఆలయ అర్చకులు వివరించారు. ఆలయ శిఖర దర్శనం చేయించారు. అనంతరం న్యాయమూర్తి దంపతులకు స్వామివారి శేషవస్త్రాలు అందించారు. జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా, కోటబొమ్మాళి కోర్టు న్యాయమూర్తి బీఎంఆర్ ప్రసన్నలత, నరసన్నపేట సీఐ శ్రీనివాసరావు, జలుమూరు ఎస్ఐ అశోక్‌బాబు ఉన్నారు.

బాలరాజుకు జీవిత సాఫల్య పురస్కారం


పురస్కారం అందుకుంటున్న బాలరాజు మాస్టారు

హిరమండలం: మండలంలోని దుర్భలాపురం గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు బాలరాజుకు హైదరాబాద్‌కు చెందిన ఆదర్శ కళానిలయం అందించే ప్రతిష్టాత్మక గురుబ్రహ్మ లఫ్‌టైం అచీవ్‌మెంట్ (జీవిత సాఫల్య పురస్కారం) ఐపీఎస్ రామ్‌రెడ్డి, టీవీ మూవీ ఆర్టిస్టులు రాజేంద్రకుమార్, గణేష్‌రెడ్డి, జబర్దస్త్ అప్పారావు చేతుల మీదుగా అందుకున్నారు. విద్యా వ్యవస్థకు చేస్తున్న కృషిని గుర్తించి ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు బాలరాజు ఆదివారం తెలిపారు. మండల, జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు పొందిన బాలరాజు రాష్ట్ర, జాతీయ స్థాయిలో 14 పురస్కారాలు అందుకున్నారు. సొంతంగా కొంత ఖర్చు చేస్తూ నిరుద్యోగ అభ్యర్థుల కోసం ఆన్‌లైన్ సేవలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ అవార్డుకు ఎంపిక చేయడం పట్ల గ్రామ పెద్దలు, యువత అభినందించారు.

గంజాయి రవాణాపై నిఘా


బలద వద్ద బస్సులో తనిఖీలు చేస్తున్న ఎస్ఐ, పోలీస్ సిబ్బంది

కొత్తూరు: గంజాయి రవాణా జరగకుండా ఉండేందుకు మండలంలోని ఒడిశా రాష్ట్రానికి అనుకుని ఉన్న బలద గ్రామం వద్ద ఆదివారం స్థానిక ఎస్ఐ ఎం.ఎ.అహ్మద్ తన సిబ్బందితో బస్సులతోపాటు ఇతర వాహనాలను తనిఖీ చేపట్టారు. ఒడిశా నుంచి గంజాయి ఎక్కువగా రవాణా కావడంతో ఎస్పీ ఆదేశాల మేరకు ఆంధ్రా–ఒడిశా సరిహద్దు వద్ద తనిఖీలు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. తనిఖీల్లో ఎటువంటి మత్తు పదార్థాలు, గంజాయి పట్టుబడలేదని ఎస్ఐ పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సారవకోట: మండలంలోని బుడితి సబ్‌స్టేషన్ పరిధిలో నిర్వహణ పనుల నిమిత్తం సోమవారం విద్యుత్ సరఫరాను నిలుపుదల చేయనున్నట్లు టెక్కలి ఈఈ శంకరరావు ఆదివారం తెలిపారు. ఉదయం 9 నుంచి 2 గంటల వరకు బుడితి, అవలింగి, చీడిపూడి, బద్రి, గుమ్మపాడు, అక్కివలస తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామన్నారు.

● రహదారిపై మురుగునీరు


సారవకోట మండలంలోని మాకివలస గ్రామ రహదారిపై మురుగునీరు ప్రవహిస్తోంది. ఈ మార్గం గుండా కోదడ్డపనస గ్రామంలోని శ్రీస్వయంభూ అయ్యప్ప స్వామి ఆలయానికి భక్తులు వెళ్తుంటారు. మురుగునీటి కాలువలు పూడికలతో నిండిపోయాయి. స్థానికులు, ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. **- సారవకోట**

● అన్నసమారాధన


నరసన్నపేట మండల కేంద్రంలోని జోగిపేటలో ఆదివారం అన్నసమారాధన కార్యక్రమం ఏర్పాటు చేశారు. నరసన్నపేట పట్టణంలో వినాయక నవరాత్రుల ముగింపు సందర్భంగా మారుతీనగర్, చిత్తిరి వీధి తదితర చోట్ల అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలను స్వీకరించారు. **- నరసన్నపేట**

● కిరణ స్పర్శ


నరసన్నపేట పట్టణంలోని కలివరపుపేటలో గల షిర్డీ సాయి మందిరంలోని సాయి విగ్రహాన్ని ఆదివారం ఉదయం సూర్యకిరణాలు తాకాయి. ఉదయం 6.30 నుంచి ఐదు నిమిషాలు సూర్య కిరణాలు తాకాయని అర్చకులు చెల్లూరు విశ్వనాథం తెలిపారు. ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో సాయినాథుడిని దర్శించుకున్నారన్నారు. ఏటా ఈ నెలలో ఈ విధంగా సూర్యకిరణాలు తాకుతున్నాయని తెలిపారు. **- నరసన్నపేట**

పశువుల్లో ఎద.. గుర్తించకుంటే బాధ

- ఎద తప్పితే పునరుత్పత్తి తగ్గుదల
- పాడి రైతులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలి


డాక్టర్ ఎం.కరుణాకరరావు, పశువైద్య ప్రాంతీయ సహాయ సంచాలకులు, పాతపట్నం

పాతపట్నం: పాడి పశువులు యుక్త వయస్సుకు వచ్చిన తర్వాత అండాశయంలో ఉత్పత్తి అయిన హార్మోన్ల ప్రభావంతో ఎద లక్షణాలను వ్యక్తం చేస్తాయి. వీటిని గుర్తించి సకాలంలో కత్రిమ గర్భాధారణ చేయించడం పునరుత్పత్తి యజమాన్యంలో అత్యంత కీలకం. చాలా మంది పాడి రైతులు ఎదను సరిగా గుర్తించకలేక నష్టపోతున్నారు. ఒక ఎద తప్పినా వాటి పునరుత్పత్తి జీవిత కాలంలో నెల తగ్గిపోతుంది. నష్టం విలువ వెయ్యి నుంచి పదిహేను వందల వరకు ఉంటుంది. అందుకే పశువుల ఎద కాలాన్ని సూచించే లక్షణాలను ప్రతి పాడి రైతూ తెలుసుకుని ఉండాలి. ఈ లక్షణాలను ఎలా గుర్తించవచ్చో ప్రాంతీయ పశువు సహాయ సంచాలకులు డాక్టర్ మంచు కరుణాకరరావు ఇలా చెబుతున్నారు.

మూగ ఎద..
ఎద లక్షణాలు కనిపించకుండా పోవడమే మూగ ఎద అంటారు. ఇది గుర్తించడం కష్టమే. జాగ్రత్తగా గమనిస్తూ ఉంటే సులువుగానే కనిపెట్టోచ్చు. గేదెలు 50 శాతం మూగ ఎదలోనే ఉంటాయి. ఆ


సీది పశువుల ఆస్పత్రి వద్ద ఆవుకు వ్యాక్సిన్ వేస్తున్న వైద్యురాలు శ్రీవాణి

సమయంలో అవి కీచుగా అరుస్తాయి. దగ్గరనున్న పశువుల్ని, మనుషులను బెదురుగా చూస్తాయి. గేదెలు మార్చి నుంచి ఆగస్టు నెలల్లో ఎదకు వస్తాయి. ఈ మధ్య కాలంలో మూగ ఎద లక్షణాలను గుర్తించానికి రోజుకు పది నిమిషాలు గేదెల ప్రవర్తనను గమనించాలి. ఎండా కాలంలో ఎద లక్షణాలన్నీ కనిపించవు. సరైన పోషణ లేని గేదెల్లో అసలు ఆ లక్షణాలే కనిపించవు. సుమారు 50 శాతం గేదెల్లో పునరుత్పత్తి సమస్యలు ఎద లక్షణాలను గుర్తించక పోవడంతోనే కలుగుతాయి.

జాగ్రత్తగా గమనించాలి..
పాడి పశువుల్లో వచ్చే ఎదను జాగ్రత్తగా గమనించాలి. మూగ ఎదకు వచ్చే పాడి పశువుల్లో ఎద కాలం సాధారణం కన్నా ఎక్కువ కాలం ఉండోచ్చు. అవసరమైతే కత్రిమ గర్భధారణ చేసిన ఆరు గంటల తర్వాత మళ్లీ గర్భాధారణ చేయించాలి. గేదెలు లేదా సంకరజాతి పశువుల్లో ఎదకు వచ్చిన 7, 10 రోజుల్లో మళ్లీ ఎదకు వస్తే గర్భాధారణ చేయించాలి. పాడి పశువులు ప్రతీ 25 రోజులకు ఒకసారి ఎదకు వస్తుంటాయి. కొన్ని సందర్భాల్లో 3 నుంచి 5 నెలల చూడి కాలంలో ఎదకు వస్తాయి. దీనినే చూడి ఎద అంటారు. ఆ సమయంలో వీటికి గర్భాధారణ చేయించకూడదు.

ఆవుల్లో ఎద లక్షణాలు..
ఆవుల్లో ఎద కాలం 18 నుంచి 24 గంటలు ఉంటుంది. సాధారణంగా ఎద కాలాన్ని మూడు దశలుగా విభజించారు. ఎదకు వచ్చిన ఆవులు తొలి దశలో మంద నుంచి వేరుపడి చికాకుగా ఉంటాయి. ఆకలి మందగించడంతో మేత సరిగా తినవు. మధ్య దశలో ఇతర ఆవులతో కలిసి ఉన్నా చికాకుగానే ఉంటాయి. ఈ దశలో ఆకలి బాగా పడిపోతుంది. చివరి దశలో చికాకు తగ్గిపోతుంది. మేత మాములుగానే ఉంటుంది. తొలి దశలో పాల ఉత్పత్తి తగ్గుతుంది. మధ్య దశలో పాలు బాగా తగ్గిపోతాయి. చివరి దశలో మాములు స్థితికి వచ్చేస్తాయి.

గేదెల్లో ఎద లక్షణాలు..
తరచూ చిరుమూత్రం పోసే గేదెలు ఎదలో ఉన్నట్లు గుర్తించాలి. కొన్ని ఐదు నిమిషాలకు నాలుగు, ఐదు సార్లు మూత్ర విసర్జన చేస్తాయి. గేదెల్లో ఎద లక్షణాలు 24 నుంచి 36 గంటల పాటు ఉంటాయి. ఈ సమయంలో గేదె చికాకుగా ఉంటూ మేత తినడం మానేస్తుంది. పాడి గేదెలు ఎదకు వచ్చినప్పుడు పాలు తగ్గుతాయి.

జగనన్నకు కృతజ్ఞతలు


మాట్లాడుతున్న కరిమి రాజేశ్వరరావు, నాయకులు

- కృష్ణదాస్‌కు అండగా ఉంటాం
- డీసీసీబీ మాజీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు

నరసన్నపేట: వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షునిగా ధర్మాన కృష్ణదాస్‌ను నియమించిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి నరసన్నపేట నియోజకవర్గానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ కార్యాలయం వద్ద ఆదివారం డీసీసీబీ మాజీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, ఎంపీపీ ఆరంగి మురళి, పోలాకి మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు ముద్దాడ బైరాగినాయుడు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు చింతు రామారావు, జేసీఎస్ కన్వీనర్ సురంగి నర్సింగరావు, పార్టీ నాయకుడు కేసీహెచ్‌బీ గుప్త మాట్లాడారు. ఎమ్మెల్యేగా సుదీర్ఘ అనుభవం, డిప్యూటీ సీఎంగా పనిచేసిన సామర్థ్యం ఉన్న ధర్మాన కృష్ణదాస్‌కు మరోసారి జిల్లా అధ్యక్ష పదవిని కట్టబెట్టారన్నారు. కృష్ణదాస్ నాయకత్వంలో పార్టీని జిల్లా వ్యాప్తంగా అభివృద్ధి చేస్తామని, మళ్లీ జగనన్నను సీఎంను చేసే వరకూ సైనికుల్లా పనిచేస్తామన్నారు. కృష్ణదాస్‌ను అధ్యక్షునిగా నియమించడంతో జిల్లా వ్యాప్తంగా పార్టీ శ్రేణులు ఆనందం వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. పార్టీ నాయకులు బొబ్బాది ఈశ్వరరావు, కనపల శేఖర్, బగ్గు రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఫ్లెక్సీ తొలగింపు తగదు

బూర్జ: పశ్చిమగోదావరి జిల్లాలోని కాళ్ల మండలం ఏల్లూరుపాడు గ్రామంలో గల డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ ఫ్లెక్సీని ఉండి నియోజకవర్గ ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు తొలగించడం ఎంతమాత్రం సమంజసం కాదని బూర్జ మండలానికి చెందిన దళిత సంఘ నాయకుడు కంట కృష్ణారావు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో విలేకర్లతో మాట్లాడారు. అంబేడ్కర్‌కు మొక్కి క్షమాపణ చెప్పాలన్నారు. ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రఘురామకృష్ణ రాజు ప్రజాప్రతినిధిగా సమాజంలో ఉండడం ఎంతమాత్రం శ్రేయస్కారం కాదన్నారు. రాజ్యాంగం ద్వారానే ప్రజాప్రతినిధిని అయ్యాననే విషయాన్ని మర్చిపోయారన్నారు. అక్కడ ఏదైనా పొరపాటు జరిగి ఉంటే దానికి ఒక చట్టం ఉంటుందన్నారు. తక్షణమే రఘురామకృష్ణ రాజుపై కేసు నమోదు చేయాలన్నారు.

ఎరువుల సరఫరాలో ప్రభుత్వం విఫలం


చింతాడ సూర్యనారాయణ

కొత్తూరు: ప్రభుత్వం నిర్ణయించిన రేటు కంటే ఎక్కువ ధరలకు యూరియా, డీఏపీలతోపాటు పలు రకాల ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తున్నా.. సంబంధిత వ్యవసాయ అధికారులు పట్టించుకోవడం లేదని వైఎస్సార్‌సీపీ నాయకుడు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ చింతాడ సూర్యనారాయణ అన్నారు. కొత్తూరులో ఆదివారం మాట్లాడుతూ.. రైతులకు అవసరమైన యూరియా సరఫరా చేయడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. యూరియా కొరత వల్ల.. 50 కిలోల యూరియా బస్తా రూ.400లకు దాటి రైతులు కొనుగోలు చేయాల్సిన దుస్థితి నెలకొందన్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రతీ రైతుకు అవసరమైన ఎరువులు ఇంటి వద్దే అప్పటి ప్రభుత్వం నిర్ణయించిన రూ.278లకు విక్రయించడం జరిగిందని గుర్తుచేశారు. ఖరీఫ్‌లో రైతులు పడుతున్న కష్టాలను కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఇంతవరకు పెట్టుబడి సాయం అందకపోవడంతో అధిక వడ్డీలకు రుణాలు వాడాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. కూటమి ప్రభుత్వం రైతులకు అవసరమైన ఎరువులు సరఫరా చేయడంతోపాటు అధిక రేట్లను నియంత్రించాలని డిమాండ్ చేశారు.

వంద రోజుల పాలనలో చేసేందేమీ లేదు


నక్క తులసీదాస్

సారవకోట: కూటమి ప్రభుత్వం ఏర్పడి 100 రోజుల పాలనలో చేసేందేమీ లేదని డీఎల్‌డీఏ చైర్మన్ నక్క తులసీదాస్ ఆరోపించారు. ఆదివారం బుడితిలో విలేకర్లతో మాట్లాడుతూ మంచి ప్రభుత్వం అని కార్యక్రమాలు చేపట్టడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు 1వ తేదీన జీతాలు ఇస్తున్నాం, విజయవాడ వరదలలో చిక్కుకున్న వాళ్లని రక్షించామని చెప్పుకుంటున్నారే తప్ప.. ఎన్నికల హామీలలో ఇచ్చిన ఒక్క పథకాన్ని అయినా ప్రజలకు అందించారా అని ప్రశ్నించారు. పథకాలు అందించేందుకు షాకులు ఎదుక్కుంటున్నారే తప్ప.. హామీలను అమలు చేసేందుకు ఏ ఒక్క ప్రయత్నం చేయడం లేదన్నారు. కూటమి ప్రభుత్వ తప్పులను కూడా గత ప్రభుత్వ తప్పిందాలుగా బురదజల్లి గట్టెక్కాలని చూస్తున్నారని ఆరోపించారు.

నేడు వైద్య శిబిరం

నరసన్నపేట: స్వచ్ఛతా హీ సేవలో భాగంగా సోమవారం నరసన్నపేట వంద పడకల ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనుబాబు ఆదివారం తెలిపారు. నియోజకవర్గంలోని పారిశుధ్య కార్మికులకు ప్రత్యేకంగా ఈ వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ఈ శిబిరాన్ని ప్రారంభిస్తారన్నారు.

పాతపట్నంలో..
పాతపట్నం: స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా పాతపట్నం సీహెచ్‌సీలో సోమవారం వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు సూపరింటెండెంట్ ఎస్.కృష్ణారావు ఆదివారం తెలిపారు. పాతపట్నం నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు ఉదయం 9 గంటల నుంచి వైద్య సేవలు అందిస్తామన్నారు. ఈ వైద్య శిబిరాన్ని ప్రజలు, పారిశుద్ధ్య కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వెళ్లి రావయ్యా.. గణపయ్యా..


సారవకోట: నిమజ్జనానికి తరలిస్తున్న భారీ వినాయక విగ్రహం

సారవకోట: మండల కేంద్రంలోని కర్ణం–బ్రాహ్మణ వీధిలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహ నిమజ్జనం ఆదివారం సందడిగా నిర్వహించారు. తొలిత ప్రత్యేక పూజలు చేపట్టారు. విగ్రహానికి గ్రామంలో శోభయాత్ర నిర్వహించి అనంతరం స్థానిక కోనేరులో నిమజ్జనం చేశారు.

ధనుపురంలో..
హిరమండలం: వినాయక చవితి ఉత్సవాలను పురస్కరించుకుని మండలంలోని ధనుపురం గ్రామంలో ఏర్పాటుచేసిన వినాయకుని విగ్రహాన్ని ఆదివారం రాత్రి కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో నిమజ్జనం చేశారు. ఈ మేరకు మహిళా కమిటీ ఆధ్వర్యంలో వినాయకుడు, రాముడు, రాధాకృష్ణులు, గోపికల వంటి పలు వేషధారణలు నడుమ కోలాటం, నృత్యాల కేరింతలతో పరిసర వీధుల్లో ఊరేగించారు. వినాయకుడిని గంగమ్మ ఒడిలోకి సాగనంపారు.

క్రికెట్ విజేతగా ఎల్.ఎన్.పేట


విజయం సాధించిన ఎల్.ఎన్.పేట యూటీఎఫ్ జట్టు

ఎల్.ఎన్.పేట: ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) స్వర్ణోత్సవ సంబరాల్లో భాగంగా ఆమదాలవలస తాలుకా కేంద్రంగా ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రాంగణంలో ఆదివారం జరిగిన క్రికెట్ పోటీల్లో ఎల్.ఎన్.పేట మండలం యూటీఎఫ్ జట్టు విజయం సాధించింది. ఆటల పోటీలను యూటీఎఫ్ జిల్లా కార్యదర్శులు టి.వి.టి.భాస్కరరావు, జి.శ్రీరామచంద్రమూర్తి, ఆటిట్ కమిటీ సభ్యులు ఎస్.జయరాం ప్రారంభించారు. యూటీఎఫ్ స్వర్ణోత్సవ సంబరాల్లో భాగంగా పలు పోటీలను నిర్వహిస్తున్నామని సంఘ నాయకులు తెలిపారు. ఇందులో భాగంగా ఆదివారం జరిగిన క్రికెట్ పోటీల్లో ఆమదాలవలస, బూర్జ, ఎల్.ఎన్.పేట, సరుబుజ్జిలి మండలాలు తలపడ్డాయి. బూర్జ జట్టుపై ఎల్.ఎన్.పేట జట్టు విజయం సాధించింది. పోటీల్లో కె.సింహాచలం, చిన్నారావు, పైడి రాజు, బి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలి


రికార్డులను పరిశీలిస్తున్న పైడి కూర్మారావు

ఆమదాలవలస: మహిళా స్వయం శక్తి సంఘాలు పంచ సూత్రాలు అమలులో భాగంగా అతి ముఖ్యమైన రికార్డుల నిర్వహణపై అప్రమత్తంగా ఉండాలని వెలుగు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ పైడి కూర్మారావు సూచించారు. ఆదివారం కొర్లకోట, నిమ్మతొర్లాడ గ్రామాల్లో మహిళా సంఘాల పనితీరు, బుక్ కీపింగ్‌ను పరిశీలించి పలు సూచనలు చేశారు. తీసుకొన్న పొదుపు రుణాలను సక్రమంగా చెల్లిస్తుంది, లేనిది పరిశీలించారు. రికార్డులను సక్రమంగా నిర్వహించి ప్రతీ ఏడాది తప్పనిసరిగా ఆడిట్ చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ కో ఆర్డినేటర్ మామిడి చంద్రరావు, వీఓఏ వనజాక్షి, శారద తదితరులు పాల్గొన్నారు.

సందడిగా నిమజ్జనం


నిమజ్జనానికి సిద్ధం చేస్తున్న విశ్వబ్రాహ్మణ సేవా సంఘం సభ్యులు

పాతపట్నం: స్థానిక రైల్వే ట్రాక్ సమీపంలో విశ్వబ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో విశ్వకర్మ జయంతి ఉత్సవాలు ఆదివారం ముగిశాయి. విశ్వకర్మ ప్రతిమను ఆదివారం రాత్రి ఊరేగించి, మహేంద్రనయలో నిమజ్జనం చేశారు. నియోజకవర్గ విశ్వబ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు కొత్తపల్లి రవి, సంఘం సభ్యులు డి.కామరాజు, డి.శంకర్, పి.చలపతిరావు, ఆచార్యులు, ఆర్.జియాన్న, ఆర్.ఆదినారాయణ, లోకేశ్వరరావు, సంతోష్ చార్యులు తదితరులు పాల్గొన్నారు.

పెద్దలక్ష్మీపురంలో పారిశుద్ధ్య పనులు


కాలువల్లో పూడికలు తీస్తున్న దృశ్యం

పాతపట్నం: మండలంలోని పెద్దలక్ష్మీపురం గ్రామంలో ఆదివారం ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు నిర్వహించారు. డ్రైనేజీలను శుభ్రం చేసి, మురుగు నీరు నిల్వ లేకుండా చర్యలు చేపట్టామని సర్పంచ్ అన్నెపు సుజాత తెలిపారు. కాలువల్లోని పూడికలు, పిచ్చి మొక్కలను తొలగించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. ఎ.ఉమామహేశ్వరరావు, పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

గోతులు పూడ్చారు


గోతులను పూడుతున్న యువజన సంఘం సభ్యులు

బూర్జ: మండలంలోని కొరగాం గ్రామ జంక్షన్ వద్ద పాలకొండ–శ్రీకాకుళం ప్రధాన రహదారిలో ఏర్పడి గోతులను గ్రామానికి చెందిన శ్రీసీతారామ యువజన సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పూడ్చారు. ఈ కార్యక్రమంలో యువకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

భారీ వర్షం


రెల్లి వీధిలోకి చేరిన హడ్డుబంగి గెడ్డ వరద నీరు

కొత్తూరు: మండలంలో ఆదివారం సాయంత్రం కుండపోతగా వర్షం కురుసింది. హడ్డుబంగి గెడ్డలో వరదనీరు భారీగా ప్రవహించింది. కొత్తూరులోని రెల్లి వీధిలోకి నీరు చేరింది. కొత్తూరు నాలుగు రోడ్ల కూడలి వద్ద, బత్తిలి, పాలకొండ రహదారుల్లో నీరు చేరింది. వాహనదారులు పలు అవస్థలు పడ్డారు. శ్రీకాకుళం రోడ్డులో ఏర్పడిన భారీ గోతుల్లో నీరు చేరడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు.

సత్కారం..


రాజారావు మాస్టార్‌ను సత్కరిస్తున్న దృశ్యం

పొందూరు: హైదరాబాద్ రవీంద్ర భారతిలో ఆదివారం భవానీ సాహిత్య వేదిక(కరీంనగర్) ఆధ్వర్యంలో శ్రీమద్భగవద్గీత విశ్లేషణాత్మక గ్రంథ ఆవిష్కరణ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శ్రీకాకుళం జిల్లా శ్రీశ్రీ కళా వేదిక ప్రధాన కార్యదర్శి వావిలిపల్లి రాజారావు మాస్టార్‌ను ఘనంగా సత్కరించారు. ఈ గ్రంథంలో తొలి అధ్యాయంపై వర్తమాన సామాజిక కోణాన్ని అన్వయించి మాస్టార్ విశ్లేషణ జరిపిన నేపథ్యంలో ఈ పురస్కారాన్ని జరిపారు. ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి, గీతా ప్రచారక్ యోగి రవికాంగ్ టాటా, ఆచార్య చెన్నప్ప, సమావేశ కర్త డాక్టర్ వైరాగ్యం ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.